ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
నంద్యాల
జిల్లా వార్తలు 5
మంగళవారం 18 జూన్ 2024




మంత్రి ఫరూక్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ముస్లింలు



కర్నూలులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తి శ్రద్ధలతో బక్రీద్


నంద్యాలలో మాట్లాడుతున్న మతపెద్ద

- మసీదులలో ప్రార్థనలు చేసిన ముస్లింలు
- శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్

నంద్యాల (కల్చరల్), జూన్ 17: బక్రీద్ వేడుకలోని త్యాగశీలతను, త్యాగనిరతిని భావితరాలకు చాటి చెప్పాలని, సేవాగుణం, పరస్పర సహకార భావాలను పంచుకోవడమే బక్రీద్ ఉద్దేశమని ముస్లిం మతపెద్దలు పిలుపునిచ్చారు. సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లింలు బక్రీద్ (ఈద్-ఉల్-అదా)ను ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదుల వద్ద మత పెద్దలు నమాజ్‌లు చేయించి, దైవ సందేశాన్ని అందించారు. బక్రీద్ వేడుక దైవం కోసం చేసిన త్యాగగుణాన్ని తెలియజేస్తుందని, అయితే ఈ త్యాగగుణ జీవనాన్ని చిత్తశుద్ధిగా పాటించినప్పుడే దానికి సార్థకత చేకూరుతుందని చెప్పారు. త్యాగమయమైన జీవితం అత్యుత్తమ విలువలతో కూడుకున్నదని, ఇది ప్రతి ఒక్కరూ అంతర్గతంగా, బాహ్యంగా పాటించాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఇస్లాం ప్రబోధిస్తుందన్నారు. నేటి యువతకు పండుగల్లోని పరమార్థాన్ని తెలియజేస్తూ, భావితరాలకు అనుసరణీయంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. ఈద్ నమాజ్‌ల అనంతరం ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' తెలియజేసుకున్నారు. నంద్యాల భీమవరం రోడ్డులో ఉన్న ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పాల్గొన్నారు. ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సాయిబాబా నగర్ ఈద్గాలో ఇమాముల సంఘం అధ్యక్షుడు అంజద్‌బాషా సిద్దిఖీ, భీమవరం అల్‌పుర్‌ఖాన్ ఈద్గాలో మౌలానా అబ్దుల్ హాది సాహెబ్, మూలసాగరం ఈద్గాలో మౌలానా మహబుబ్‌బాషా సాహెబ్, ఎస్‌ఆర్‌బీసీ ఈద్గాలో ముఫ్తి రఫి సాహెబ్ ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


వెలుగోడులో..





పదవీ గండం..!

- ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్ పదవులపై టీడీపీ గురి
- దక్కించుకునేందుకు పావులు కదుపుతున్న అధికార పార్టీ నేతలు
- వైసీపీలో అలజడి.. డోన్‌లో ఆసక్తికరంగా రాజకీయం

డోన్, జూన్ 17: వైసీపీ హయాంలో ఉన్న ఆ పదవులకు గండం ముంచుకొస్తోంది. అధికార టీడీపీ నేతలు ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్ పదవులపై గురి పెట్టారు. వాటిని దక్కించుకునేందుకు ముమ్మరంగా పావులు కదుపుతున్నారు. దీంతో డోన్‌లో ఆసక్తికర రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిణామాలు వైసీపీలో అలజడులు రేపుతున్నాయి. 2021 ఆగస్టులో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో డోన్ మండలంలో ఎంపీపీ పదవిని వైసీపీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలుండగా.. ఇందులో 16 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవంగా దక్కించుకోగా, టీడీపీ ఒకటి, సీపీఐ ఒక ఎంపీటీసీ స్థానాన్ని దక్కించుకున్నాయి. దీంతో ఎంపీపీగా రేగటి రాజశేఖర్ రెడ్డి పదవిని చేపట్టారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడం, డోన్‌లో టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో డోన్‌లో వైసీపీ నుంచి ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న పలు పదవులకు గండం వచ్చి పడింది.

● ఎంపీపీ పదవిపై టీడీపీ గురి: డోన్ ఎంపీపీ పదవిపై టీడీపీ గురి పెట్టింది. ఎంపీపీ పదవిని దక్కించుకునేందుకు అధికార టీడీపీ నాయకులు అప్పుడే ప్రయత్నాలు మొదలు పెట్టారు. మండలంలోని పలువురు ఎంపీటీసీలు కొందరు టీడీపీ నాయకులకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. ఎంపీపీ పదవిపై అవిశ్వాస తీర్మానం పెడితే మద్దతు ఇస్తామని పలువురు ఎంపీటీసీలు టీడీపీ నాయకులతో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. అయితే వైసీపీ ఎంపీటీసీలు చేజారకుండా ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే టీడీపీలోని కీలకనేతలు ఎంపీపీ పదవిని దక్కించుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

● మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకునే ప్రయత్నాలు: డోన్ మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు టీడీపీలోని కీలక నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. డోన్ మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులున్నాయి. ఇందులో 31 వార్డుల్లో వైసీపీ కౌన్సిలర్లు ఉండగా.. సీపీఐ కౌన్సిలర్ ఒకరున్నారు. మున్సిపల్ చైర్మన్ పదవి బీసీకి కేటాయించడంతో సప్తశైల రాజేశ్ చైర్మన్‌గా ఉన్నారు. ఇప్పటికై మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న కోట్రికే హరికిషణ్ 32వ వార్డు కౌన్సిలర్ దారా హరినాథ్ రెడ్డి, నాల్గవ వార్డు కౌన్సిలర్ ఎన్నికల ముందు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. డోన్ ఎమ్మెల్యేగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలవడం, రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. డోన్ మున్సిపాలిటీలోని పలువురు కౌన్సిలర్లు టీడీపీలోకి వస్తామని ఇప్పటికే కబురు పంపుతున్నట్లు తెలిసింది. టీడీపీలోని కీలక నేతలకు టచ్‌లోకి వెళ్లి పార్టీలోకి వస్తామని చెబుతున్నట్లు తెలిసింది. అందులో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఎన్నికల ఫలితాల తర్వాత ఎక్కడా కనిపించడం లేదు. ఇది పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది. వీటికి తోడు మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు టీడీపీ కీలక నేతలు పావులు కదుపుతున్నారు. మున్సిపాలిటీలో ప్రస్తుతం ఉన్న అధికారులను మార్చాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నిర్ణయించారు. గతంలో మున్సిపాలిటీలో పని చేసిన కమిషనర్‌ను ఇక్కడకు తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీని తర్వాత మున్సిపల్ చైర్మన్ పదవిని చేజిక్కించుకునేలా టీడీపీ కీలక నేతలు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిసింది.ఈ పరిణామాలు వైసీపీలో కలకలం రేపుతున్నాయి.



నివేదికలు సిద్ధం చేయండి

కేంద్ర కరువు బృందానికి నష్టం అర్థమయ్యేలా ఉండాలి
కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), జూన్ 17: కేంద్ర కరువు బృందం ఈ నెల 20 తేదీలలో జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం కరువు బృంద పరిశీలకుల పర్యటనపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరువు పరిస్థితులను తెలుసుకునే నిమిత్తం కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటర్‌మినిస్టీరియల్ టీం జిల్లాలోని ఉయ్యాలవాడ, దొర్నిపాడు, కోవెలకుంట్ల, మండలాల్లో పర్యటిస్తుందన్నారు. పంట నష్టం స్పష్టంగా అర్థమయ్యేలా నివేదికలు ఉండాలన్నారు. మండలానికి నాలుగైదు ఫొటోలతో పాటు నివేదికలు సిద్ధం కావాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. అలాగే పశుగ్రాస కొరతపై పశుసంవర్ధక శాఖ, ప్రకటించిన కరువు మండలాల్లో కూలీలకు కల్పించిన పనులపై డ్వామా, గ్రామాలలో నీటి రవాణాపై గ్రామీణ నీటి సరఫరా, నీటి లభ్యతను బట్టి రబీలో సాగుకు సరఫరా చేసిన సాగునీటి వివరాలను ఇరిగేషన్, భూగర్భ జల శాఖలకు సంబంధించిన అధికారులు నివేదికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాగంటిని దర్శించుకున్న ప్రకాశం జిల్లా కలెక్టర్

బనగానపల్లె, జూన్ 17: యాగంటి ఉమామమహేశ్వరస్వామివారిని సోమవారం ప్రకాశం జిల్లా కలెక్టరు దినేశ్‌కుమార్ దంపతులు, కర్నూలు కలెక్టరు సృజన దంపతులు, ఎస్పీ కృష్ణకాంత్ దంపతులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ పూజారులు, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అధికారులు నందీశ్వరుడ్ని దర్శించుకొని ఉమామహేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు, ఉమామహేశ్వర స్వామి చిత్రపటాన్ని అందించారు.


స్వామివారి సన్నిధిలో ప్రకాశం, కర్నూలు జిల్లాల కలెక్టర్ల దంపతులు.. ఎస్పీ దంపతులు కూడా..

కొత్త చట్టాలపై శిక్షణ

ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి




జూమ్ మీటింగ్‌కు హాజరైన ఎస్పీ రఘువీర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్

నంద్యాల క్రైం, జూన్ 17: భారత ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారతీయ న్యాయసంహిత (బీఎన్‌ఎస్) అనేది రిపబ్లిక్ ఆఫ్ ఇండియాలో అధికారిక క్రిమినల్ కోడ్ అన్నారు. ఇది బ్రిటిష్ ఇండియా కాలంనాటి ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) స్థానంలో డిసెంబర్ 2023లో అమలులోకి వచ్చిందని అన్నారు. ఈ చట్టం ఈ ఏడాది జూలై 1నుంచి అమల్లోకి రానుందని పేర్కొన్నారు. అందువల్ల ఈ చట్టంపై పోలీసు అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించేందుకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ట్రైనింగ్ క్లాసులు ఏర్పాటు చేశామని తెలిపారు. అందులో భాగంగానే సోమవారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలోని సిబ్బంది స్టేషన్ రైటర్, అసిస్టెంట్ రైటర్, కోర్టు కానిస్టేబుల్, సీసీటీఎన్‌ఎస్ కానిస్టేబుళ్లందరూ ట్రైనింగ్ క్లాసులకు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. శిక్షణ అనంతరం ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక పరీక్ష నిర్వహించి మంచి మార్కులు వచ్చిన వారికి బహుమతులు ఇస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్, స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ జేవీ సంతోష్ పాల్గొన్నారు.

యాగంటిలో మంత్రి బీసీ దంపతులు

బనగానపల్లె, జూన్ 17: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు కుటుంబ సమేతంగా సోమవారం యాగంటి ఉమామహేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్ర కేబినేట్ మంత్రి హోదాలో తొలిసారి ఆలయానికి వచ్చిన మంత్రి కుటుంబ సభ్యులకు ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ పూజారులు, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వారు నందీశ్వరుడ్ని దర్శించుకొని ఉమామహేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీసీ కుటుంబ సభ్యులకు ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, బత్తుల బాలిరెడ్డి, ఆర్‌సీ నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఇందిరమ్మ దంపతులకు స్వామివారి చిత్ర పటాలను అందిస్తున్న అర్చకులు



'చంద్రబాబు నాయుడు అంటే విజన్ ఉన్న నేత. ఉమ్మడి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించిన ఘనకీర్తి కూడా ఉంది. రాష్ట్ర విభజన అనంతరం కూడా ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి మొదలుపెట్టారు. ఆయన కృషితోనే జిల్లాలో విమానాశ్రయం, పరిశ్రమలు వంటివి వచ్చాయి. ఏదైనా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రోడ్లు, పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనతోనే సాధ్యం. నాపై నమ్మకంతో సీఎం చంద్రబాబు నాయుడు ఆ మూడు శాఖలను నాకు కట్టబెట్టారు. ఆ శాఖల నిర్వహణకు ఓ రూట్ మ్యాప్ తయారు చేసుకుంటాను. మౌలిక వసతుల కల్పనతో రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేలా ప్రణాళికతో పని చేస్తాం. ప్రస్తుతం ఉన్న రోడ్ల స్వరూపాన్ని పూర్తిగా మార్చి ప్రజల ఇబ్బందులు తీరుస్తాం. ఏం ఆశించి ప్రజలు టీడీపీకి పట్టం కట్టారో.. వారి ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తూ రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలుపుతాం' అంటూ రోడ్లు, భవనాల శాఖ, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

నంద్యాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):



ఆంధ్రజ్యోతి పత్రికను చదువుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నిబద్ధతతో పని చేస్తా

- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా
- ఇచ్చిన శాఖలకు న్యాయం చేస్తా
- ఓ రూట్ మ్యాప్ ప్రకారం పెట్టుబడులను తెస్తా
- ముగ్గురు మంత్రులం సమన్వయంతో సాగుతాం
- ఉమ్మడి జిల్లాను పురోగతి వైపు తీసుకువెళతాం
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



ఆంధ్రజ్యోతి: సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి ఏంటి?

బీసీ: గాలేరు-నగరి, కుందూ నది విస్తరణ వంటి పనుల వల్ల జిల్లాకు ఒరిగింది ఏమీ లేదు. కేవలం కమీషన్ల కోసం చేపట్టిన ప్రాజెక్టులే అవి. గాలేరు-నగరి లైనింగ్ పనుల్లో పూర్తి నాసిరకం పనులు చేపట్టారు. ఇక కాలువ అడుగు భాగానికి కూడా లైనింగ్ చేయడంతో ఇక్కడి భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇక రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కి రూ.3800 వేల కోట్లు ఖర్చు పెడుతున్నా, దాని వల్ల తోడుకునే నీరు తక్కువే. దానికంటే తక్కువ ఖర్చు పెడితే గుండ్రేవుల ప్రాజెక్టు ద్వారా 20 టీఎంసీలు నీటిని వాడుకోవచ్చు. ఈ విషయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు తగు న్యాయం జరిగేలా చూడటమే కాకుండా, కమీషన్ల కోసం జరిగిన అవినీతిని బయటపెడతాం.

ఆంధ్రజ్యోతి: కీలకమైన పదవి దక్కడం వెనకాల మీరు పడిన శ్రమ గురించి చెబుతారా?

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి: పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచాను. పార్టీ ఏ కార్యక్రమాలు చేపట్టమని సూచించినా వెనుకా డకుండా చేశాను. నా నిబద్ధత ఏమిటో పార్టీ పెద్దలకు అర్థమైంది. ఇవన్నీ చూసి శాఖలను సమర్థవంతంగా నిర్వహించగలనన్న నమ్మకం సీఎం చంద్రబాబు నాయుడికి కలిగింది. సాన్నిహిత్యం వల్లే నాకు మంత్రి పదవి వచ్చిందని ఎవరికైనా అనిపిస్తే నా కష్టాన్ని, నా సమర్థతను తక్కువ అంచనా వేసినట్లే.

ఆంధ్రజ్యోతి: కీలక శాఖలు అప్పగించడం పట్ల మీ అభిప్రాయం?

బీసీ: ఈ మూడు ముఖ్యమైన శాఖలే. వైసీపీ ప్రభుత్వంలో ఈ శాఖల మంత్రుల తీరు వల్ల జరిగిన అభివృద్ధి ఏమిటి? అసలు ఈ శాఖలకు గత ప్రభుత్వం ఏమేర నిధులు కేటాయించింది అన్నది ఎవరికీ తెలియదు. దీంతో ఈ శాఖలను గాడిలో పెట్టాలంటే పదేళ్లలో చేయాల్సిన శ్రమను ఐదేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. అప్పుడు గానీ మేము చేసిన మేలు ప్రజలకు కనిపించదు. కాబట్టి ముఖ్యమైన శాఖలు వచ్చినందుకు ఆనందంగా ఉన్నా లోపల కాస్త ఆందోళనగానే ఉంది. అలా అని వెనుకడు గు వేసే ప్రసక్తే లేదు. నాకు ఇచ్చిన పను లను చిత్తశుద్ధితో నిర్వహిస్తాను.



ఆంధ్రజ్యోతి: రోడ్లను ఎలా తీర్చిదిద్దబోతున్నారు?

బీసీ: మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సంబంధిత అధికారులను కలిసి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసేందుకు సిద్ధంగా ఉండండి అని చెప్పాను. 'సార్.. రోడ్లకు ప్యాచ్‌లు వేయాలని చెబుతున్నారు. జిల్లాలో రోడ్లు ఉంటే కదా ప్యాచ్‌లు వేసేది!' అని అధికారులు సమాధానమిచ్చారు. దీనికి కారణాలను అన్వేషిస్తే.. జగన్ జమానాలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా వేధించారు. కొంతమంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితిని కూడా చూశాం. దీనివల్ల మిగతా కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. టెండర్లు వేయకపోతే బ్లాక్ లిస్టులో పెడతామని వైసీపీ ప్రభుత్వం హెచ్చరించినా కాంట్రాక్టర్లు పనులకు ముందుకు రాలేదు. ఇక తెలంగాణ మంత్రులు ఏపీ రోడ్ల గురించి తక్కువ చేసిన మాట్లాడిన సందర్భాలు కూడా చూశాం. దీనిని బట్టి వైసీపీ ప్రభుత్వ పాలన ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. ముందు ఈ పరిస్థితిని మారుస్తాం. చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లిస్తామని కాంట్రాక్టర్లకు భరోసా ఇస్తాం. రోడ్లను అద్దాల్లా మారుస్తాం. ప్రజల ఇబ్బందులను దూరం చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ముగ్గురు మంత్రులు జిల్లాను ఏ విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకువెళతారు?

బీసీ: వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులు తమ సంపదను ఎలా పెంచుకోవాలి? రాష్ట్రాన్ని ఏ విధంగా అప్పుల పాలు చేయాలి? అని ఆలోచించారు తప్పించి జిల్లాను అభివృద్ధి చేసిందేమీ లేదు. ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన నంద్యాల జిల్లాను అయితే పూర్తిగా విస్మరించారు. కానీ టీడీపీ ప్రభుత్వం అలా చేయబోదు. ముగ్గురు మంత్రులం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాం. యువకుడైన టీజీ భరత్‌కు పరిశ్రమల శాఖ, నాకు పెట్టుబడుల, మౌలిక సదుపాయల శాఖ ఇవ్వడం వల్ల ఇద్దరం కలిసి నిర్ణయాలు తీసుకుంటే పెట్టుబడులు, పరిశ్రమలు జిల్లాకు భారీగా తరలి రావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఇవన్నీ సక్రమంగా నిర్వహిస్తూ అభివృద్ధి పథంలో దూసుకువెళ్లేలా చూస్తాం.

ఆంధ్రజ్యోతి: పెట్టుబడులను ఆకర్షించడం కోసం ఏమైనా ప్రణాళికలు ఉన్నాయా..?

బీసీ: గత ప్రభుత్వం పెట్టుబడుల సదస్సు పెయిడ్ ఆర్టిస్టులను తీసుకువచ్చింది. ఆ సదస్సులో ఎంవోయూలు చేసుకున్నవన్నీ డొల్ల కంపెనీలు. రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టేందుకు సదస్సు పేరిట ఆడిన పెద్ద డ్రామా. జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి నిజంగా పెట్టుబడులు పెట్టే కంపెనీలు ఏపీ రాలేదన్నది వాస్తవం. ఎవరైనా ధైర్యం చేసి వస్తే కమీషన్ల కక్కుర్తితో వాటిని తరిమేసింది. కొన్ని కంపెనీలు ఇక్కడి పరిస్థితులను చూసి భయపడి తెలంగాణ, చెన్నై, కర్ణాటక వంటి రాష్ట్రాలకు పారిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. కానీ మా సీఎం చంద్రబాబు నాయుడికి ఉన్న క్రెడిబులిటీ వేరు. గతంలో సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు చాలా కంపెనీలు క్యూ కట్టాయి. ప్రస్తుతం పెట్టుబడులను ఆకర్షించేందుకు ఒక్కో జిల్లాను ఒక నమూనాగా తీసుకుని అనుకూలమైన పరిస్థితులు కల్పిస్తాం. స్థానిక పరిస్థితులకు అనుకూలమైన పరిశ్రమలు స్థాపించేలా చర్యలు తీసుకుంటాం. రాష్ట్రాన్ని పెట్టుబడుల స్వర్గధామంగా మార్చుతాం.

పాపం.. పసిపాప

- నీటి కుంటలో పడి ఏడేళ్ల చిన్నారి మృతి
- బెంగళూరు వలస వెళ్లిన తల్లిదండ్రులు



మృతి చెందిన బాలిక వైష్ణవి

మంత్రాలయం, జూన్ 17: ఆడుతూ.. పాడుతూ తిరిగే ఏడేళ్ల చిన్నారి వైష్ణవి (7) నీటి కుంటలో పడి మృతి చెందింది. ఈ సంఘటన మంత్రాలయం మండలం బూదూరు గ్రామంలో జరిగింది. చాకలి వెంకప్ప, సుజాత దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు లావణ్య, రెండో కూతురు వైష్ణవి (7). సొంతూరులో పనులు దొరక్క పోవడంతో పిల్లల పెద్దనాన్న పెద్దమ్మ లక్ష్మీకాంత్, మహాలక్ష్మిలకు అప్పజెప్పి తల్లిదండ్రులు ఇద్దరూ బెంగుళూరు వలస వెళ్లారు. సోమవారం లావణ్య, వైష్ణవి పెద్దమ్మ మహాలక్ష్మి వెంట వాగు దగ్గరలోని కుంటలో బట్టలు ఉతికేందుకు వెళ్లి అక్కడి నుంచి పొలానికి వెళ్లారు. వైష్ణవి నీటి కుంట దగ్గరకు వెళ్లి స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడిపోయింది. రైతులు, గ్రామస్థులు హుటాహుటిన బాలికను నీటి కుంటను బయటకు తీసేలోపు అప్పటికే ప్రాణాలు కోల్పోయింది. స్థానిక బాలికల పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. ఈ వార్తను తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే బెంగళూరు నుంచి వచ్చి చిన్నారిని చూసి రోదించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ తెలిపారు.

నేడు పీఎం కిసాన్ డబ్బులు జమ

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 17: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజనకు సంబంధించి 17వ విడత డబ్బులను మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసిలో విడుదల చేయనున్నారు ఈ పథకం కింద కర్నూలు, నంద్యాల జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని 2019 ఫిబ్రవరి నుంచి అమలు చేస్తోంది. సంవత్సరానికి రూ.6వేల చొప్పున ఇప్పటికీ 16 విడతలుగా ఒక్కో విడతకు రూ.2వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. ఏటా ఏప్రిల్, జూలై నెలల్లో తొలి విడతగా, అదే విధంగా ఆగస్టు, నవంబరులో రెండో విడతగా, డిసెంబరు మార్చి మూడో విడతగా రూ.2వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సాయం అందజేస్తున్నది. ఇప్పటి వరకు ఇట్లా 16సార్లు రైతుల ఖాతాల్లో నిధులను జమ చేస్తూ వచ్చింది. పీఎం కిసాన్ బెనిఫిషియరీ స్టేటస్, ఇన్‌స్టాల్మెంట్ స్టేటస్ Http-s://-p-m-k-i-san.-go-v.in పోర్టల్‌ను ఓపెన్ చేసి తెలుసుకోవచ్చు.

రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

ఆదోని, జూన్ 17: ఆదోని మండలం పెసలబండ గ్రామానికి చెందిన గొల్ల వెంకటేశ్వర్లు, పద్మ దంపతుల ఏకైక కుమారుడు ఈశ్వర్ (20) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. పెసలబండ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, పద్మ దంపతులు ఆదోని పట్టణంలోని శిల్పా సౌభాగ్యనగర్‌లో నివాసముంటున్నారు. వెంకటేశ్వర్లు హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. వీరి ఏకైక కుమారుడు ఈశ్వర్ తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. అయితే జల్సాలకు అలవాటు పడిన ఈశ్వర్ ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడుతూ డబ్బు నీళ్లలా ఖర్చు చేసేవాడు. ఇది మంచి పద్ధతి కాదని తండ్రి వెంకటేశ్వర్లు కుమారుడికి నచ్చ చెప్పాడు. దీన్ని జీర్ణించుకోలేని ఈశ్వర్ ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నగరూరు-ఆదోని రైల్వే స్టేషన్ల మధ్య కి.మీ 492/12-10 వద్ద వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఈ విషయం తెలిసిన ఎస్ఐ గోపాల్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఈశ్వర్ శరీర భాగాలను ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ విలేకరులకు తెలిపారు.

23న ఒలంపిక్ డే రన్



మాట్లాడుతున్న ఒలంపిక్ అసోసియేషన్ సంఘం నాయకులు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 17: ఒలంపిక్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా ఈ నెల 23వ తేదీన కర్నూలు నగరంలో ఒలంపిక్ డే రన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఛైర్మన్ డా. షేక్ మహబూబ్‌బాషా, సంఘం అధ్యక్షుడు వి. రామాంజనేయులు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఒలంపిక్ డే సెలబ్రేషన్స్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 18న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అంతర్ పాఠశాల బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19న అంతర్ పాఠశాలల ఫుట్‌బాల్ పోటీలు, 20న తైక్వాండో, అదే రోజు స్థానిక గణేష్‌నగర్‌లో ఉన్న స్కేటింగ్ రింగులో స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న కలెక్టరేట్ దగ్గర నుంచి కొండారెడ్డి బురుజు వరకు ఒలంపిక్ రన్ ఉంటుందన్నారు. సెలబ్రేషన్స్‌లో విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, క్రీడాకారులు శ్రేయోభిలాషులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాధితులను ఆదుకుంటాం

- ఎంపీ బస్తిపాటి నాగరాజు



మృతదేహాల వద్ద ఎంపీ బస్తిపాటి నాగరాజు

తుగ్గలి, జూన్ 17: ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన కామేశ్వరమ్మ, సుంకన్న కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని.. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని రామలింగాయపల్లెలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన వ్యక్తుల భౌతికకాయాలకు పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పిడుగుపాటుకు ఈ ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో పాటు దాదాపు 90 గొర్రెలు కూడా మృతి చెందాయి. అలాగే పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఫోన్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. జొన్నగిరి ఎస్ఐ గ్రామానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం చేయించి కేసు నమోదు చేశారు. వీరి వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి, మాజీ ఎంపీపీ కొమ్మె వెంకటేష్ ఉన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు నగదు చెల్లింపు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 17: నగర శివారులోని టిడ్కో లబ్ధిదారులు ఇంటి కోసం చెల్లించిన నగదును ప్రభుత్వం తిరిగి వారి అకౌంట్లో వేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో టిడ్కో ఇంటి కోసం లబ్ధిదారులు నగదు చెల్లించారు. అయితే అనివార్య కారణాల వల్ల తమకు ఇళ్లు వద్దని..తమ నగదు వెనక్కి ఇవ్వాలని గత నాలుగు సంవత్సరాలుగా కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. ఈ మేరకు సుమారు 500 మందికి పైగా నగదు తిరిగి చెల్లించాలని ప్రభుత్వానికి నగర పాలక సంస్థ అధికారులు నివేదికలు పంపారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక 84 మంది లబ్ధిదారులకు రూ.54,37,500 విడుదల చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మిగిలిన లబ్ధిదారులకు కూడ త్వరలోనే నగదును చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అర్హత లేనివారు, తమ అవసరం ఉందని కొందరు నగదు వెనక్కి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఔషధశాల కౌంటర్ ప్రారంభం

- కాన్పుల వార్డుల దగ్గర ఏర్పాటు
- దూరం ఉందంటున్న రోగులు



కొత్తగా ఏర్పాటు చేసిన ఔషధ కౌంటర్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 17: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఔషధశాల మందులిచ్చే కౌంటర్ (13)ను సోమవారం కాన్పుల వార్డు దగ్గర ప్రారంభించారు. నాలుగు కౌంటర్లలో ఫీమేల్‌కు 2, మేల్‌కు రెండు కేటాయించారు. క్యాజువాల్టీ పక్కన ఉన్న ఫార్మసీ కౌంటరు వద్ద మందులు తీసుకునేందుకు రోగులు క్యూలైన్లలో బారులుతీరి ఉంటారు. ఈ సమస్యను అధిగమించేందుకు కాన్పుల వార్డు సమీపంలో ఉన్న రోగుల సహాయకుల విశ్రాంతి భవనంలోకి మర్చారు. అయితే ఔషధశాలను మార్చడంపట్ల కొందరు రోగులు సంతోషం వ్యక్తం చేస్తుండగా.. మరికొందరు దూరంగా ఉందని అంటున్నారు. కాన్పుల కోసం వచ్చిన గర్భిణుల సహాయకులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న రోగుల విశ్రాంతి భవనంలో ఔషధశాలను మార్చడం వల్ల ఇబ్బందిగా ఉందని అంటున్నారు. ఔషధశాల ముందు మురుగునీరు, డ్రైనేజీ నీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన వస్తున్నది. డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి ఔషధ శాల వద్ద సౌకర్యాలు కల్పించాలని రోగులు కోరుతున్నారు. కోతుల బెడదను కూడా నివారించాలని అంటున్నారు.

● దూరంగా ఉంది



కొత్తగా కాన్పుల వార్డు దగ్గర ఏర్పాటు చేసిన మందుల కౌంటరు దూరంగా ఉంది. కాళ్ల నొప్పులు ఉన్న నేను ఇంత దూరం వచ్చి మందులు తీసుకోవడం కష్టంగా ఉంది.

- కర్రెన్న రోగి, రేమట, కర్నూలు మండలం

● దగ్గరలో ఉండాలి



మందుల కౌంటరు దగ్గరగా ఉంటే బాగుంటుంది. ఇక్కడ విశాలంగా ఉన్నప్పటికీ మాలాంటి వృద్ధులకు కష్టంగా ఉంది. మందుల కౌంటరు వద్ద వాసన వస్తున్నది.

- రంగస్వామి, శ్రీరంగాపురం, వెల్దుర్తి మండలం

నలుగురు సీఐలకు స్థానచలనం

కర్నూలు, జూన్ 17: కర్నూలు రేంజ్ పరిధిలో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ సోమవారం డీఐజీ విజయరావు ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జే. శివశంకర్	వీఆర్ కడప	మైదుకూరు రూరల్
ఎం. శ్రీనాథ్ రెడ్డి	మైదుకూరు రూరల్ సర్కిల్	వీఆర్, కడప
డి. రామాంజనేయుడు	వీఆర్, కర్నూలు రేంజ్	మైదుకూరు యుజీ
ఏపీ మస్తాన్	మైదుకూరు యుజీ పీఎస్	వీఆర్, కడప

టెలికాం నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు, జూన్ 17: టెలికామ్ నగర్‌లో చైన్ స్నాచింగ్ జరిగింది. వరలక్ష్మి అనే మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించుకుపోయారు. వరలక్ష్మి స్థానికంగా ఒక దుకాణం నిర్వహిస్తున్నది. బైక్‌పై వచ్చిన యువకుడు ముందుగా దుకాణంలోకి వచ్చి కురెకురె ప్యాకెట్లు కొనుక్కొని వెళ్లిపోయాడు. మరో పది నిమిషాల తర్వాత వచ్చి బైక్‌ను బయట నిలిపి స్వీట్ కావాలని అడిగాడు. ఆ వృద్ధురాలు మూత తీసి స్వీట్ల కోసం చేయి డబ్బాలో పెట్టగా మెడలోని గొలుసును లాక్కుని ఉడాయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

ఘనంగా బక్రీద్

● ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు ● కిటకిటలాడిన మసీదులు, ఈద్గాలు ● బందోబస్తు చేపట్టిన పోలీసులు


మిడుతూరులో..

నంద్యాల (కల్చరల్), జూన్ 17: నంద్యాల పట్టణంలోని ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు సందేశం వినిపించారు. ముస్లింలు అధిక సంఖ్యలో తరలిరావడంతో మసీదులు, ఈద్గాలు కిటకిటలాడాయి. ప్రముఖులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో సోమవారం బక్రీద్ పర్వదిన వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అల్లాను స్మరించారు. మతపెద్దలు పండుగ ప్రాశస్త్యాన్ని వివరించి ప్రపంచం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసం ముగిసిన 70రోజుల తర్వాత దైవప్రవక్త త్యాగ్యాన్ని స్మరిస్తూ బక్రీద్ వేడుకలను జరుపుకొంటున్నట్లు చెప్పారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఖబరస్తాన్‌కు చేరుకుని తమ పితరులను స్మరించి వారి ఆత్మశాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. అదేవిధంగా బక్రీద్ పండుగ సాంప్రదాయం ప్రకారం వారివారి స్థాయిల ప్రకారం దానధర్మాలు చేశారు. ఇదిలావుంటే బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు అందరు ఆనందంగా గడిపారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు మతసామరస్యంతో బంధుమిత్రులను తమ ఇళ్లను ఆహ్వానించి ఆతిథ్యమిచ్చారు.

మహానంది: మహానంది మండలంలో బక్రీద్ పర్వదినం వేడుకలు ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గ్రామాల్లో ఉదయం ఊరేగింపుగా మసీదులు, ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదుల్లో ముత్తవల్లి ప్రత్యేక ప్రార్థనల అనంతరం ధార్మిక ఉపన్యాసాలు ఇచ్చారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్ పండుగను నిర్వహించుకున్నారు.

వెలుగోడు: బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు వెలుగోడులోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరి నొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మత పెద్దలు బక్రీద్ ప్రాముఖ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని, పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

బండిఆత్మకూరు: మండల వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ వేడుకను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.గ్రామాల్లోని, ఈద్గాలు, మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దాన, ధర్మాలు చేశారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.


బండిఆత్మకూరు: శింగవరంలో ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

పాణ్యం: బక్రీద్ పర్వదిన సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పాణ్యం యూత్, పాణ్యం టైమ్స్ ఆధ్వర్యంలో నంద్యాల విజయా బ్లడ్ సెంటర్ నిర్వహణలో దాదాపు వంద మంది యువకులు రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలు, రూ. 5వేల విలువ చేసే ఉచిత ఆరోగ్య పరీక్షల కూపన్లు అందజేశారు. కార్యక్రమంలో విజయా బ్లడ్ సెంటర్ కోఆర్డినేటర్ బాబా ఫక్రుద్దీన్. టెక్నీషియన్స్ శిరీష, ప్రవీణ్, సురేష్, రవి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

● మండలంలో బక్రీద్ పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం స్థానిక ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కౌలూరు పరిధిలోని సున్నీ మసీదు వద్ద పెద్ద ఎత్తున ముస్లీంలు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

గడివేముల: మండలంలోని అన్నిగ్రామాల్లో సోమవారం బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈద్గా వద్దకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు.

నందికొట్కూరు: ముస్లింలు నియోజకవర్గ వ్యాప్తంగా బక్రీద్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం పట్టణంలోని కర్నూలు రోడ్డు మార్గంలో ఉన్న ఈద్గా వద్ద ముస్లి మత పెద్దలు, అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లో రబ్బాని గ్రూప్ అధినేత అల్-హజీ-హజీ మహబూబ్ సాహెబ్, నందికొట్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, ముస్లీం మత పెద్దలు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం రబ్బాని గ్రూప్స్ అధినేత అల్-హజ్-హజ్ మహబూబ్ సాహెబ్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ అన్నది త్యాగానికి ప్రతీకని ప్రపంచంలోనే ప్రజలు శాంతి సామరస్యాలతో సుభిక్షంగా ఉండాలంటూ ప్రార్థనల్లో అల్లాను ప్రార్థించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన ముస్లిం ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండలంలోని గ్రామాల్లో బక్రీద్‌ను ఘనంగా నిర్వహించుకున్నారు. ముస్లింలు ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.


పాములపాడులోని ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు

పగిడ్యాల: మండలంలోని వివిధ గ్రామాలలో ముస్లింలు బక్రీద్ పండుగను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లోని ముస్లింలు ఉదయం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇమాములు బక్రీద్ పండుగ సందేశాన్ని తెలియజేశారు.

పాములపాడు: మండలంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు ఒకరి నొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పాములపాడులో సోమవారం ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దానం, త్యాగానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు.

మిడుతూరు: బక్రీద్ పర్వదిన వేడుకలు మిడుతూరు మండలంలో వివిధ గ్రామాలతో పాటు మండల కేంద్రం మిడుతూరులో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్గాల దగ్గర ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని దుద్యాల, ముసలిమడుగు, శివపురం, కొత్తపల్లి, ఎదురుపాడు కొక్కెరంచ, నందికుంట తదితర గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మత పెద్దలు మాట్లాడుతూ స్వార్థం, అసూయ, కోపం, రాగద్వేషాలను విడిచి పెట్టి మానవుల్లో త్యాగనిరతిని వ్యాపింపజేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. అన్ని గుణాల కన్నా దాన గుణమే ఉత్తమమైనదని బక్రీద్ సారాంశమని చెప్పుకొచ్చారు. బక్రీద్ స్ఫూర్తిగా సమైక్యతను, సమానత్వాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఇమాం పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరినొకరు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.


నందికొట్కూరులో..


జూపాడుబంగ్లాలో..


గడివేములలో..


ఆత్మకూరులో..


నందికొట్కూరు రూరల్: బ్రాహ్మణకొట్కూరులో..


మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌కు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకుడు గోకుల్ కృష్ణారెడ్డి


పాణ్యంలో బక్రీద్ సందర్భంగా రక్తదానం చేస్తున్న యువకులు


వెలుగోడులో..


కొత్తపల్లి: శివపురంలో..

రైతుల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే


జూపాడుబంగ్లాలో విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, జూన్ 17: వైసీపీ ప్రభుత్వం రైతులను, రైతుకూలీలను నట్టేట ముంచిందని, చంద్రబాబునాయుడు రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తారని, రైతులకు అన్నివిధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. జూపాడుబగ్లాలోని సచివాలయం వద్ద సోమవారం రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమం సర్పంచ్ బాలయ్య, ఎంపీటీసీ వెంకటమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జయసూర్య పాల్గొని రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేశారన్నారు. పించన్ల పెంపు, రైతుల టైటిలింగ్ యాక్టు రద్దు, అన్నక్యాంటీన్లు యువతకు స్కిల్‌పై ప్రాధాన్యత కల్పించారని అన్నారు. చంద్రబాబు హయాంలో ప్రారంభించిన జైన్‌ఇరిగేషన్ పరిశ్రమ, మెగా సీడ్‌పార్కులను వైసీపీ ప్రభుత్వం నిలిపేసిందని, వాటిని కనీస సౌకర్యాలు అందించి అభివృద్ధి చేస్తే యువతకు, వ్యవసాయకూలీలకు ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. ఈ సందర్భంగా కేసీ కింద తూములు, కాలువలు అధ్వానంగా ఉన్నాయని, జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకాలు పనిచేయడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. నియోజకవర్గ పరధిలో ఉన్న సాగు, తాగునీటి పథకాలను అభివృద్ధి చేయడానికి అధికారులతో సమీక్షా నిర్వహించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, గిరీశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లుయాదవ్, మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, రమణారెడ్డి, మద్దూరు సుధాకర్, కృష్ణయ్య, జంగాల పెద్దన్న, రవికుమార్ యాదవ్, బాబు, హనుమంతరెడ్డి, నారాయణరెడ్డి, గోరేసాహెబ్, ఖాజీకురైషన్, మన్సూర్‌బాషా, ఏడీఏ విజయశేఖర్, ఏవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు, జూన్ 17: నందికొట్కూరు మార్కెట్ యార్డును ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సోమవార ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ అధికారులు ఎమ్మెల్యేకు పూలమాల వేసి స్వాగతం పలికారు. మార్కెట్ యార్డులో నిరుపయోగంగా ఉన్న పైపులను, శిథిలావస్థలో ఉన్న భవనాన్ని, తదితర వాటిని ఆయన పరిశీలించారు. మార్కెట్ యార్డులో జరుగుతున్న కార్యకలాపాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, జమీల్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి ఫరూక్‌ను కలిసిన ఎమ్మెల్యే జయసూర్య

మంత్రి ఫరూక్‌ను కలిసిన ఎమ్మెల్యే జయసూర్య

రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను ఆదివారం రాత్రి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. నంద్యాలలోని మంత్రి నివాసంలో ఆయనను ఎమ్మెల్యే, నాయకులు పూలమొక్కను అందజేశారు. నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రమణారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, రమేష్‌రెడ్డి, నారపురెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, మద్దిలేటి, శేఖర్ ఉన్నారు.

'వీరస్వామి కుటుంబానికి అండగా ఉంటాం'

నందికొట్కూరు పట్టణానికి చెందిన వీరస్వామి అనారోగ్యంతో ఆదివారం అర్థరాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

'ఎంపీపీ మృతి బాధాకరం'


మాజీ ఎంపీపీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బైరెడ్డి

పాములపాడు, జూన్ 17: తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీపీ లక్ష్మీదేవమ్మ మరణం బాధాకరమని, పార్టీకి తీరని లోటు అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పాములపాడులో లక్ష్మీదేవమ్మ మృతదేహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి లక్ష్మీదేవమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలుగుదేశం పార్టీకి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, హరినాథరెడ్డి, ఎల్లయ్య, రమేశ్ మధుకృష్ణ, గోవింద్, వెంకటేశ్వరరావు, సురేశ్, హరిప్రసాద్, శివశంకరరెడ్డి, మల్లికార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● వేంపెంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు గాండ్ల కృష్ణుడు (70) మృతి చెందాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ సోమవారం మృతి చెందాడు. మాజీ ఎంఎల్ఎ బైరెడ్డి రాజశేఖరరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ గత 35 సంలుగా టీడీపీ పార్టీలో కొనసాగుతూ పార్టీ, గ్రామ అబివృద్ధే లక్ష్యంగా పనిచేశారని, కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకొన్నారు..కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, లెనిన్‌బాబు కుటుంభ సభ్యులు ఉన్నారు.

'ఉపాధ్యాయులపై కేసులు ఎత్తివేయాలి'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 17: ఉపాధ్యాయులపై గత ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించి వారిపై నమోదు చేసిన బైండోవర్ కేసులను, సస్పెన్షన్‌లను, చార్జి మెమోలను టీడీపీ ప్రభుత్వం ఎత్తి వేయాలని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధాకర్, కుమార్ కోరారు. సోమవారం నంద్యాలలోని జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2022లో పదో తరగతి పరీక్షల సందర్భంగా ఉపాధ్యాయులపై నమోదు చేసిన బైండోవర్ కేసులను ఎత్తి వేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అనారోగ్య కారణాలతో ఎన్నికల విధులకు హాజరు కాని ఉపాధ్యాయులపై ఉన్న సస్పెన్షన్లను, చార్జి మెమోలను మానవతా దృక్పథంలో నూతన ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసిన 117 జీవోను రద్దు చేసి ఉన్నత పాఠశాలలో విలీనమైన 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో కలపాలన్నారు. కార్యక్రమంలో ధరణి, కుపేంద్ర, రామకృష్ణ, రాము తదిరతులు పాల్గొన్నారు.

'డబ్బులు వసూలు చేస్తే సహించం'

నంద్యాల (కల్చరల్), జూన్ 17: నందికొట్కూరు, పాణ్యం ప్రాంతాలలో కొందరు వలంటీర్లు మధ్యాహ్నం భోజనం పథకంలో, అలాగే ఇతర ర ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ. లక్షల్లో డిమాండు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, నిజమని తేలితే ఉపేక్షించేది లేదని టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ అరాచకాలతోనే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని జగన్ రాజకీయ సమాధి ఆయనే కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల డబ్బుతో వైజాగ్‌లోని రుషికొండ ప్యాలెస్ నిర్మాణాలే జగన్ రాచరిక పాలనను గుర్తుచేస్తున్నాయన్నారు. ప్రభుత్వం రైతుల పట్టాదార్ పాస్‌బుక్కులపైన జగన్ ఫోటోలు పెట్టుకోవడం వినాశనానికి దారి తీసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారని అన్నారు. చంద్రబాబుకు చెడ్డపేరు వచ్చేలా టీడీపీ లో ఎవరూ ప్రయత్నం చేసినా క్షమించబోమని హెచ్చరించారు.

మొక్కు తీర్చుకున్న జనసేన నాయకులు

మహానంది, జూన్ 17: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో మహానంది మండలానికి చెందిన జనసేన పార్టీ నాయకులు కేరళ లోని అయ్యప్ప స్వామి ఆలయంలో మొక్కు తీర్చుకున్నారు. సోమవారం మండలంలోని ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు అశోక్, ప్రభు, రాజు, శ్రీను శబరిమల అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. జనసేన పార్టీ అధికారం లోకి వస్తే శబరిమల వస్తామని తాము మొక్కు కున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే మూడు రోజుల క్రితం ప్రత్యేక వాహనంలో కేరళ లోని శబరిమలకు వచ్చి అయ్యప్ప స్వామిని దర్శించి పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

కూలీ మృతి

పాములపాడు, జూన్ 17: పాములపాడులో పొలం పనులకు వెళ్లిన ఆంజనేయులు (50) సంలు గుండెపోటు రావడంతో చనిపోయిన ఘటన చోటు చేసుకొంది. పాములపాడు కు చెందిన ఆంజనేయులు స్థానిక గ్రామరైతు పొలంలో సేద్యం పనులకోసం కూలీకి వెళ్లి మధ్యాహ్న సమయంలో గుండె పోటు రావడంతో కుప్ప కూలిపోయారు. గమనించిన చుట్టు పక్కల రైతులు వచ్చి వైద్యశాలకు తరలించారు. అప్పటికే గుండెపోటుతో చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మహానంది, జూన్ 17: దైవదర్శనం కోసం మహానందికి వచ్చిన భక్తుడు సెల్‌ఫోన్ పోగొట్టుకొన్నారు. విషయాన్ని ఆలయ అధికారుల దృష్టికి తీసుక రావడంతో తిరిగి అప్పగించిన ఘటన సోమవారం జరిగింది. కడప జిల్లా పెండ్లిమర్రికి చెందిన గంగా శివప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శనం కోసం మహానందికి వచ్చారు. ప్రధాన ఆలయాల్లో దర్శనం తర్వాత భక్తుడు సమీపంలోని పెద్ద నంది విగ్రహం వద్ద తన సెల్‌ఫోన్‌ను జారవిడుచుకున్నాడు. అక్కడ విధులు నిర్వహిస్తున్న దేవస్థానం ఏజన్సీ ఉద్యోగి రమేష్ తనకు కనిపించిన సెల్‌ఫోన్‌ను సమాచారం కేంద్రంలో అప్పగించారు.

కలెక్టర్‌ను కలిసిన బైరెడ్డి


కలెక్టర్‌తో మాట్లాడుతున్న బైరెడ్డి

నంద్యాల (కల్చరల్), జూన్ 17: మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో కొత్తపల్లి మండలం సిద్ధేశ్వరం, జానాలగూడెం, బలపాలతిప్ప గ్రామాల నిరుపేదలు చెంచుగిరిజనులు నంద్యాల కలెక్టరేట్‌లో కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. నీటి ముంపు బాధితుల సమస్యలు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి జిల్లాకలెక్టర్ కు వివరించగా కలెక్టర్ స్పందించి పోలీస్, ఇరిగేషన్, రెవిన్యూ, పంచాయతీ రాజ్ తదితర అధికారులతో త్వరలో సమావేశం జరిపి పూర్తి వివరాలు సేకరించి నీటిముంపు గ్రామాల్లోనే గ్రామాలను నమ్ముకొని స్థిరనివాసం ఉంటున్న వారికే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు.

వేలం పాటలో పెరిగిన ఆదాయం

బండిఆత్మకూరు, జూన్ 17: మండలంలోని పెద్దదేవళాపురం ఆలయ భూముల వేలం పాటల్లో ఆదాయం పెరిగిందని ఈవో నాగప్రసాద్ తెలిపారు. సోమవారం గ్రామంలోని వరదరాజస్వామి, ఆంజనేయ స్వామి, లింగమయ్య స్వాములకు చెందిన 40.36 ఎకరాల ఆలయ భూములకు ఇన్‌స్పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. పాటల్లో 55 మంది రూ.వెయ్యి చొప్పున ధరావత్తు చెల్లించారు. గత ఏడాది ఈ భూములకు రూ.12,35,200 రాగా, ఈ ఏడాది రూ.17,29,30 లభించిందని, గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.4,94,100 అదనం ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. వేలం పాటల్లో గ్రామ పెద్దలు, రైతులు, సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బేతంచెర్ల, జూన్ 17: పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలపై జిల్లా విద్యా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలకు అడ్డు లేకుండా పోయిందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ప్రదీప్, సుబ్బరాయుడు, మధు, వెంకటాద్రి, మహేష్, రహంతుల్లా పాల్గొన్నారు.

ఆలయ భూముల వేలంలో పెరిగిన ఆదాయం

దొర్నిపాడు, జూన్ 17: దొర్నిపాడు మండలంలోని కొండాపురం గ్రామంలో వెలసిన సిద్ధేశ్వర స్వామి ఆలయ భూముల వేలం పాటలో రూ.1.28 లక్షలు ఆదాయం పెరిగినట్లు ఈవో చంద్రుడు తెలిపారు. సోమవారం ఈవో చంద్రుడు ఆధ్వర్యంలో సిద్ధేశ్వరస్వామి ఆలయ భూముల వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించి 28.01 ఎకరాల ఆలయ భూములను వేలం వేయగా రూ.5.44 లక్షలకు రైతులు కౌలు పాడి పొలాలను దక్కించుకున్నారని తెలిపారు. గత ఏడాది రూ.4.16 లక్షలు వేలం జరిగిందని చెప్పారు. ఈ ఏడాది అదనంగా రూ.1.28 లక్షలు ఆదాయం పెరిగిందని అన్నారు. క్రిష్టిపాడు గ్రామంలో నిర్వహించాల్సిన కౌలు వేలం పాటను అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు ఈవో చంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకుడు సిద్ధి సత్యం, మాజీ సొసైటీ చైర్మన్ డీలర్ శివుడు తదితరులు ఉన్నారు.

'టీడీపీతోనే పేదల సంక్షేమం'

చాగలమర్రి, జూన్ 17: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. సోమవారం చాగలమర్రి బీసీ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ రాక్షస పాలన అంతమై ప్రజా పాలన వచ్చిందని అన్నారు. బీసీలకు 50 ఏళ్లకు పింఛన్ హామీ ఇచ్చిన ఘనత టీడీపీకే దక్కిందని అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రామతీర్థం, వీరయ్య, సుబ్బరాయుడు, చిన్ని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'



చాగలమర్రి చెన్నకేశవ ఆలయంలో అధ్యక్షుడిని సన్మానిస్తున్న టీడీపీ, కమిటీ సభ్యులు

చాగలమర్రి, జూన్ 17: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. సోమవారం ఏకాదశి సందర్భంగా చెన్నకేశవ ఆలయంలో కొత్త అధ్యక్షుడిగా వేణుగోపాల్‌రెడ్డిని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. ఎంపికైన అధ్యక్షుడిని టీడీపీ నాయకులు, కమిటీ సభ్యులు సన్మానించారు. అయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తామని అన్నారు. అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు భూమా అఖిలప్రియకు, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి. భాస్కర్, వెంకటరమణ, ప్రసాదరెడ్డి, లక్ష్మీనారాయణ, దస్తగిరి, రోహితేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సురేష్, వెంకటరమణ, రాము, నరసింహప్రసాద్ పాల్గొన్నారు.

కోట్లకు మంత్రి పదవి ఇవ్వాలి

డోన్(రూరల్), జూన్ 17: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కొత్తపల్లి గ్రామ ముస్లిం మైనార్టీ నాయకులు నబీ రసూల్, మిన్నెల్ల డిమాండ్ చేశారు. సోమవారం కొత్తపల్లి గ్రామంలో వారు మాట్లాడుతూ రాజకీయాల్లో కోట్ల కుటుంబానికి మంచి పేరు ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక మంత్రిపదవిని కేటాయించి సముచిత స్థానం కల్పించాలని కోరారు. సమావేశంలో ముస్లిం మైనార్టీ నాయకులు కాశీం, రఫీ, గ్రామ టీడీపీ నాయకులు రాజశేఖర్‌గౌడు, బలిజ మద్దయ్య, పెద్దయ్య, వీరాంజనేయులు, రామాంజనేయులు, టీవీ సుంకాచారి, టీవీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

ప్యాపిలి, జూన్ 17: మండలంలోని అలేబాదు గ్రామంలో సోమవారం టీడీపీ నాయకుడు సుదర్శన్(32) గుండెపోటుతో మృతి చెందాడు. జిల్లా టీడీపీ కార్యదర్శి పరమేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలసి ఓదార్చారు. ఆయన వెంట మల్లికార్జున, శేఖరయ్య, సంజన్న, శంకరయ్య పాల్గొన్నారు.

బిజినవేములలో శుద్ధ జల కేంద్రం ప్రారంభం

కోవెలకుంట్ల, జూన్ 17 : బిజినవేముల గ్రామంలో మూతపడిన శుద్ధ జల కేంద్రాన్ని సోమవారం టీడీపీ నాయకులు ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్ ఎన్నికల అనంతరం గ్రామంలో వైసీపీ నాయకుల మధ్య విబేధాలు ఉండడం వల్ల ఇరువర్గాల వైసీపీ నాయకులు శుద్ధ జల కేంద్రానికి చెరొక తాళం వేసి మూసివేయించారు. ఎన్నికల ముందు బీసీ జనార్దన్‌రెడ్డి గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సోమవారం టీడీపీ నాయకులను మినరల్ ప్లాంటు తయారు చేసి ప్రజలకు తాగునీటిని అందించాలని ఆదేశించారు. టీడీపీ నాయకులు గజ్జల హుసేనయ్య, పెద్దహుసేనయ్య, అవుకు రాధాక్రిష్ణమూర్తి, మనోహర్, సుబ్బరాయుడు, షరీఫ్ కలిసి మంత్రి బీసీ సహకారంతో మినరల్ ప్లాంటు ప్రారంభించి ప్రజలకు తాగునీటిని అందించారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే



నంద్యాల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్‌ను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఆమె తమ్ముడు భూమా విఖ్యాత్‌రెడ్డి సోమవారం ఉండవల్లిలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిగా బాధ్యతలు తీసుకున్న అయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

రుద్రవరం, జూన్ 17: మండలంలోని పెద్దకంబలూరు గ్రామానికి చెందిన భవాని (24) అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి సోమవారం తెలిపారు. పెద్దకంబలూరు గ్రామానికి చెందిన తుపాకుల భవానీ అనే మహిళతో ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన తుపాకుల తిరుపతితో మూడేళ్ల క్రితం వివాహమైంది. మూడేళ్ల నుంచి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదులో తెలిపారు. భర్త తిరుపతి, మామ నారాయణ, అత్త కోటమ్మతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చంద్రబాబుతోనే ముస్లింల అభివృద్ధి

● డోన్ ఎమ్మెల్యే కోట్ల ● జిల్లాలో ఘనంగా బక్రీద్



బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



ప్యాపిలిలో...



చాగలమర్రిలో ఈద్ ముబారక్ తెలుపుకుంటున్న టీడీపీ నాయకులు



రుద్రవరంలో ప్రార్థనలు

డోన్, జూన్ 17: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి సాధ్యమవుతుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఈద్గా ప్రాంగణంలో బక్రీద్ వేడుకల్లో ఎమ్మెల్యే కోట్ల పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీ వర్గాలకు న్యాయం చేసేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటారన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఐదు సంతకాలతో రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించారన్నారు. డోన్ నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి విజయభట్టు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ముస్లిం మైనార్టీ నాయకులు అన్వర్‌భాషా, ఎస్ఎండీ రఫీ, టీడీపీ మైనార్టీ నాయకులు చాంద్ బాషా, డిష్ రఫీ, దస్తగిరి, నూర్‌బాషా, బాబా ఫక్రుద్దీన్, ఇమాంసా, మైనార్టీ యూత్ లీడర్ రషీద్‌బాబు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలో సోమవారం ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బేతంచెర్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో పట్టణంలో భక్తిశ్రద్ధలతో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పట్టణ శివారులోని కొలుములపల్లె రస్తాలో, పట్టణంలోని అన్ని మసీదు ప్రాంతంలోని సుమారు 1500 మంది ముస్లిలు ఈద్గాలకు వెళ్లి మండల ఖాజీ నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్ గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

డోన్(రూరల్): పట్టణంతో పాటు డోన్ మండలంలో పలు గ్రామాల్లో బక్రిద్ పండుగ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని గుత్తి రోడ్డు సమీపంలో ఈద్గా మసీదులో ఉదయాన్నే ముస్లింలు పెద్ద ఎత్తున చేరకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని చనుగొండ్ల, కొత్తపల్లి, పెద్దమల్కాపురం, చిన్నమల్కాపురం తదితర గ్రామాలో వేడుకలను జరుపుకున్నారు.

కొలిమిగుండ్ల రూరల్: మండలంలో సోమవారం బక్రీద్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. కొలిమిగుండ్లలో మండల ఖాజీ అధ్యక్షతన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని బెలుం, పేట్నీకోట, అంకిరెడ్డిపల్లె, తిమ్మనాయినిపేట తదితర గ్రామాల్లో బక్రీద్ వేడుకలను నిర్వహించారు.

సంజామల: మండల వ్యాప్తంగా సోమవారం ఈద్-ఉల్-జుహా(బక్రీద్) వేడుకలను సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. సంజామలలో అన్వర్‌మౌలానా ముస్లింలకు నవాజు చేయించి ఖురాన్ దివ్య సూక్తలను వివరించారు. మండలంలోని ముస్లింలకు బక్రీద్ పండుగ పురస్కరించుకొని ఆయా గ్రామ టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రమైన సంజామల టీడీపీ నాయకులు పెండేకంటి కిరన్‌కుమార్,మాజీ ఎంపీటీసీ యూసఫ్‌హుసేన్,రెడ్డి మగ్బుల్, అమీర్‌సాహెబ్, పేరుసోములలో బెలుం సురేశ్‌రెడ్డి, గిద్దలూరులో బత్తుల ప్రతాప్‌రెడ్డి, కానాలలో కేశవరెడ్డి, ముక్కమళ్లలో మూసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఆకుమళ్లలో పుల్లారెడ్డి, ఆల్లకొండలో చిన్నబాబు, తదితరులు ఆయా గ్రామాల్లోని ఈద్గాలకు వెళ్లి ముస్లింలతో కలసి ప్రార్థనలు చేసి బక్రీద్ వేడుకల్లో పాల్గొన్నారు.

బీసీ కుటుంబ సభ్యులకు బక్రీద్ శుభాకాంక్షలు

బనగానపల్లె: బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మలు ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల అందరి ఆశీర్వాదంతో మంత్రిగా మీ అందరికి సేవా చేసే భాగ్యం లభించిందన్నారు. బక్రీద్‌పర్వదిన సందర్భంగా ముస్లింలు వందలాదిగా తన ఇంటికి తరలివచ్చారు.

● బనగానపల్లె మండలంలో బక్రీద్ పర్వదిన వేడుకలు ముస్లింలు సోమవారం జరుపుకున్నారు. బనగానపల్లె పట్టణంలో ఈద్గా నగర్‌లోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు ఒకరికొకరు కలుసుకొని ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రుద్రవరం: రుద్రవరం మండలంలో సోమవారం బక్రీదు సందర్భంగా ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు ఈదుల్ జోహ నమాజ్‌లు భక్తిశ్రద్ధలతో చేశారు. రుద్రవరం, ఆలమూరు, కొండమాయపల్లె, కోటకొండ, యల్లావత్తుల, పెద్దకంబటూరు, చిన్నకంబలూరు, నరసాపురం, మందలూరు, ముత్తలూరు గ్రామాల్లో ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు .నమాజ్‌ల అనంతరం ముస్లింలు ఆలింగనం చేసుకుని చిన్నారుల నుంచి పెద్దల వరకు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఈద్గాల నందు దైవమార్గంలో నడవాలని హఫీజ్‌లు సందేశం వినిపించారు.

శిరివెళ్ల: మండలంలోని ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. శిరివెళ్ల, యర్రగుంట్ల, బోయలకుంట్ల తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉయ్యాలవాడ: బక్రీదు సందర్భంగా మండలంలోని ఉయ్యాలవాడ, నర్సిపల్లె, బోడెమ్మనూరు, కాకర వాడ, హరివరం, కొండుపల్లె, అల్లూరు తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

● బక్రీదు సందర్భంగా ఉయ్యాలవాడ టీడీపీ మండల కన్వీనరు బోరెడ్డిశేఖర్‌రెడ్డిని ముస్లిం మత పెద్దలు కలిశారు. సోమవారం ఉదయం ఆయన స్వగృహంలో ముస్లింలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సన్మానించారు. అనంతరం టీడీప నాయకులు ముస్లింలకు స్వీట్లు పంచిపెట్టారు. టీడీపీ ముస్లింలకు ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నర్సిరెడ్డి, దస్తగిరిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చాగలమర్రి గ్రామంలోని ఈద్గా వద్ద అధిక సంఖ్యలో ముస్లింలు తరలివచ్చిన ప్రభుత్వ ఖాజీ యూనస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ పండుగ విశిష్టత గురించి మత పెద్దలు తెలియజేశారు. ఆయా మసీదుల్లో కూడా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, బీసీ సెల్ స్పోక్‌పర్సన్ నల్లా నాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, పలువురు ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు. ఎస్ఐ రమణయ్య పర్యావేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం బక్రీద్ పండుగను మస్లింలు ఘనంగా నిర్వహించారు. దొర్నిపాడు, క్రిష్టిపాడు, చాకరాజువేముల, భాగ్యనగరం, గుండుపాపల తదితర గ్రామాల్లోని మసీదుల్లో, ఈద్గాల వద్ద మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అవుకు: బక్రీద్ పండుగను మండలంలోని ముస్లింలు ఘనంగా సోమవారం జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అవుకు పట్టణంలోని ముస్లింలు మసీద్ నుండి బయలుదేరి మెట్టుపల్లె రహదారిలోని నవాజ్ కొండపై ఉన్నా ఈద్గా వద్దకు ముస్లింలు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ ప్రాంతంలోని ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకొన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని పాత, కొత్త మసీదు ప్రాంతాలలోని ముస్లింలు ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ సాధిక్ ఆధ్వరంలో ముకుమ్మడిగా ఎస్.లింగందిన్నె రోడ్డులోని ఈద్గా వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు.



మంత్రి బీసీకి బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు



బనగానపల్లెలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఉయ్యాలవాడలో ముస్లింలకు స్వీట్లు తినిపిస్తున్న టీడీపీ నాయకులు



దొర్నిపాడు: క్రిష్టిపాడులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సంజామల ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కొలిమిగుండ్లలో



ఆళ్లగడ్డ ఎస్.లింగందిన్నె రోడ్డులోని ఈద్గాలో ప్రార్థనలు



అవుకులో...

మంత్రిని కలిసిన నాయకులు

డోన్, జూన్ 17: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం బనగానపల్లెలోని తన నివాసంలో మంత్రి బీసీని కలిసి ఆయన అభినందనలు తెలిపారు.

కోవెలకుంట్ల: మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం బనగానపల్లెలోని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్వగృహనికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. కోవెలకుంట్ల మాజీ సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ గువ్వల సుబ్బారెడ్డి తన అనుచరులతో కలిసి బనగానపల్లె చేరుకుని మంత్రి జనార్దన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, లింగాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు లింగాలనాయుడు, చిన్నకొప్పెర్ల మాజీ సర్పంచ్ బుచ్చన్న, వెంకటసుబ్బారెడ్డి, ఎం.గోవిందిన్నె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బాలరాజులు కలిసి బనగానపల్లె చేరుకుని మంత్రి జనార్దనరెడ్డిని కలిసి శుభాకాంలు తెలిపారు. వీరితో పాటు బీజేపీ నాయకులు సీతారామయ్య, వెంకటసుబ్బయ్య శుభాకాంక్షలు తెలిపారు.

బనగానపల్లె: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని నందవరం ఆలయ ఈవో కామేశ్వరమ్మ సోమవారం బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మంత్రి బీసీకి ఈవో, ఆలయ పూజారులు చౌడేశ్వరీ మాత తీర్థ ప్రసాదాలు అందించారు.

కొలిమిగుండ్ల రూరల్: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సోమవారం కలిశారు. ఇటిక్యాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తోట శివారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి యాగంటి క్షేత్రంలో ఉన్న బీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబీకులతో మంత్రి భేటీ

బనగానపల్లె: బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు, వారి కుటుంబ సభ్యులు సోమవారం బనగానపల్లె పట్టణంలోని పెండేకంటి నగర్‌లో నివసిస్తున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపులో ప్రధాన పాత్ర పోషించిన కాటసాని చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులతో బీసీ దంపతులు, వారి కుటుంబ సభ్యులు ముచ్చటించారు. తన గెలుపుకు సహకరించిన చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబీకులకు బీసీ అభినందనలు తెలిపారు. అలాగే మంత్రి పదవి అలంకరించిన బీసీని కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ కూతురు, అల్లుడు మనోరమ, రమణారెడ్డి, టంగుటూరు శ్రీనయ్య, భాస్కర్‌రెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, సంగు శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసిన ధర్మవరం సుబ్బారెడ్డి



టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్ రెడ్డితో భేటీ అయిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



మంత్రి బీసీతో ఇటిక్యాల శివారెడ్డి కుటుంబ సభ్యులు



బీసీ ఇందిరమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింల నాయకులు

టీడీపీకి ధర్మవరం సుబ్బారెడ్డి సేవలు ఎనలేనివి



సుబ్బారెడ్డిని అభినందిస్తున్న టంగుటూరు శీనయ్య తదితరులు

బనగానపల్లె రూరల్ , జూన్ 17: టీడీపీకి ధర్మవరం సుబ్బారెడ్డి అందిస్తున్న సేవలు ఎనలేనివని టీడీపీ నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య అన్నారు. సోమవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయానికి వచ్చి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలుసుకున్నారు. బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో ధర్మవరం సుబ్బారెడ్డిని టంగుటూరు శీనయ్య తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో లాయర్ నాగేంద్రారెడ్డి, రిటైర్డు ఎంఈవో పక్కీర్‌రెడ్డి, బత్తుల బాలిరెడ్డి, బత్తుల బాస్కర్‌రెడ్డి, ఆర్‌సి నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, వంకదార ప్రసాద్, టీచర్ నాగరాజు, ఖాదర్ , తలారి హరి, కాసుల జంగంశెట్టి, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామిని దర్శించుకున్న మంత్రి



కుంకుమార్చన చేస్తున్న మంత్రి కుటుంబ సభ్యులు

బేతంచెర్ల, జూన్ 17: ఏకాదశిని పురస్కరించుకుని మండలంలో ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, సతీమణి బీసీ ఇందిరమ్మ, కుమార్తె బీసీ మనోరమారెడ్డి కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. మంత్రి హోదాలో తొలిసారిగా కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి, ఆలయ అర్చకులు, అధికారులు సాంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. మద్దిలేటి స్వామి ఆశిస్సులతో చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర సుభిక్షంగా విలసిల్లాలని, సంక్షేమ అభివృద్ధి ఫలాలతో బనగానపల్లె ప్రజలు సుఖశాంతులతో విలసిల్లాలని ప్రార్థించినట్లు బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. అనంతరం ఆలయ ఈవో రామాంజనేయులు శాలువతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.